# రసాభాస

"అయ్యో బాబోయ్" అన్న కేక వినిపించింది గట్టిగా.

ఆ భవంతిలో ఉన్న మిగతా మూడు సంసారాలు అదివినవచ్చిన వాకిట నిలచినయి.

"ఏమిటి అమ్మా? అన్నాడు తెలుగు తెలిసిన పెద్ద మనిషి ఒకడు.

"పాముండోయ్" అని పడిపోయింది లత.

"ఎక్కడ? ఎక్కడ?" అంటూ ఆతురతతో ఒక పెద్ద బడిత తెచ్చాడు శ్రీనివాసరావు.

"క్యాహై? క్యాహై" అంటూ అరుస్తున్నాడు సాహెబు ఒకడు.

మిగిలినవాళ్ళుగూడా తలోకఱ్ఱ తెచ్చారు.

సేఠ్ జీ, పెళ్లాం బిడ్డలను "జాగ్రత్త" అని హెచ్చరిస్తున్నాడు జారిపోయే బట్టబిగిస్తూ.

బయట ఒక మంచం వేసి దాని మీద లతను పడుకుండబెట్టి మొగాన నీళ్ళు చల్లారు.

కొద్ది సేపటికి తెలివి వచ్చింది ఆమెకు.

లోపల అంతా వెతుకుతున్నారు.

లతకు వణకు తగ్గలేదు.

సేఠ్ జీ మంత్రించిన విబూది తెచ్చేందుకు దగ్గర ఉన్న పూజారి ఇంటికి కొడుకుని పంపాడు.

సాహెబుకు సంగతిఅర్థమయిందిగావును, ఒక ఇనుపకడ్డీ తీసుకుని తను గూడా బయలుదేరాడు అన్వేషణకు.

లోపల అన్వేషణ జరుగుతోంది.

లతను అమ్మలక్కలు చుట్టు ముట్టారు.

"ఎంత ఉందమ్మా? ఎలా ఉందమ్మా" అన్నది ఒకామె.

"ఇంకానయం అదృష్టవంతురాలివి" అన్నది సేఠ్ జీ భార్య పిల్లలను దగ్గరకు తీసుకుంటూ.

ఫలానా చోట చూశానని చెప్పింది లత.

సేఠ్ జీ లోనికివెళ్ళి సంగతి వివరించాడు దూరాన నుంచుని.

దాని వెనుక పెట్టెలున్నాయి. వాటి సందుకుజేరి ఉంటుందన్నారు ఒకరు.

జాగ్రత్తగా వాటిని బయటకులాగారు.

"జాగ్రత్త సుమా" సేఠ్ జీ హెచ్చరిస్తున్నాడు.

పెట్టె లోపల వెళ్ళిందేమోనని సందేహం వెలిబుచ్చి పెట్టె కుమ్మరించాడు సాహెబు.

ఎంత వెదకినా కనిపించలేదు.

"బహుశ ఆ ప్రక్కనున్న వంటగదిలోకి పోయి ఉంటుంది" అన్నారు.

వంటగదిలో అన్వేషణ ప్రారంభమయింది.

ఊరగాయ జాడీలు, అవీ, ఇవీ అన్నీ జరిపి చూశారు.

కాని దాని జాడ తెలియటం లేదు.

ఇంతలో విబూది తెచ్చాడు. లతకు కొంచెం పెట్టించాడు సేఠ్ జీ.

తను కొంచెం పెట్టుకొని మిగిలినది తన పెళ్లాం, బిడ్డలను పెట్టుకోమన్నాడు.

వంటగదిలో తలుపులుతీసి ఉన్న అలమర మీదికి పోయింది అన్వేషకుల దృష్టి.

దాంట్లో లతమడి జాడీ లుంచుతుంది.

సాహెబు ఒకొక్కటి దింపుతూ, "ఇధర్ హై" అన్నాడు.

"ఎక్కడ, ఎక్కడ?" అంటూ అంతా మూగారు సిద్ధంగా కొట్టి చంపేందుకు.

## ఎమ్. సత్యారాయణ

అంతలో సేఠ్ జీగూడ వచ్చి కలిశాడు. దూరాన నుంచొని "అదిగో తోక" అన్నాడు సేఠ్.

అన్ని కఱ్ఱలు ఒకేసారి పనిచేసినయి.

కారం జాడీ పగిలి ఒక్కసారి చిందింది.

దానివెనుకనుంచి గబాలున క్రిందపడింది.

ఒక్కసారి ముక్కుమీద వేలు వేసుకున్నాడు శ్రీనివాసరావు.

"ఆగి - ఎంత - పని - చేసింది" అంటూ సాహెబు ఇనుపచువ్వకు పని చెప్పాడు.

నెత్తురు కక్కుకు చచ్చింది మూషికరాజం.

మరల రంగంలోకి దిగారు

అలమారులో కనపడలేదు.

తుదిసారి ప్రయత్నంగూడ విఫలమై రంగంలోంచి తప్పుకుని బయటకు వచ్చారు.

సేఠ్ జీ "ఇహ లాభంలేదు. మంత్రించిన ఇసుక తెప్పిద్దాం" అన్నాడు అమ్మలక్కలతో.

అంతలో మూర్తి వచ్చాడు.

బయట మంచంమీద పడుకొన్న శ్రీమతిని చూసి అర్థంగాక కంగారుపడ్డాడు.

గబగబా సేఠ్ జీవచ్చి కథ యావత్తూ వినిపించి "మీ లత అదృష్టవంతులండీ" అన్నాడు.

మూర్తికి అయోమయంగా ఉంది.

సంగతి సందర్భాలు వివరించారు అన్వేషకులు.

"ఇహ లోపలకురా" అన్నాడు శ్రీమతిని.

బెదురుతూ బెదురుతూ లోపలకువచ్చింది లత.

"ఎక్కడ చూసావో చెప్పు" అన్నాడు మూర్తి.

లత తాను మొదట చూసినచోటు వద్దకు వెళ్లింది.

మూర్తి ఆమె ననుసరించాడు.

అచ్చట పడిఉన్నదాన్ని చూపి "అదేమండీ" అంది లత.

దాన్ని చూడకుండానే కఱ్ఱ ఒకటి తెచ్చాడు మూర్తి. "ఎక్కడ" అంటూ.

లత చూపినదాన్ని జాగ్రత్తగా పరికించాడు.

పొట్ట చెక్కలయేటట్లు నవ్వి "నీ కండ్లకేమైనా మసక కమ్మిందేమిటి?" అన్నాడు.

"ఏమిటండీ?" అంది లత.

"అది నా లెదర్ బెల్టు. వంకెకు తగిలించింది కిందపడింది" అన్నాడు మూర్తి వచ్చే నవ్వు నాపుకుంటూ.

లతకు ఏడ్వాలో నవ్వాలో తెలియలేదు.

ఇరువురొకసారి ఇంట్లో స్థితిగతులు పరికించారు.

మూర్తికి ఉత్సాహం ఎక్కువయింది.

లత ఏమీ అనలేక సర్దటం ఉపక్రమించింది.

"చప్పనకానీ, ఇల్లు మారుద్దాములే" అన్నాడు మూర్తి.

లత ఒక వాల్చూపు విసరింది "ఊఁ" అంటూ.

ఆరాత్రి...

"ఏమండీ ఈ సంగతి ఎవరికీ తెలియనీయరుగదూ! మీరు చాలా మంచివారు" అంది లతదగ్గరకు జరుగుతూ.

"అలాగే దేవి" అంటూ లతను దగ్గిరకు తీసుకున్నాడు మూర్తి గుప్పుమంటున్న సన్నజాజుల పరిమళం భరించలేక.

లత మాలతీలతలా అల్లుకుపోయింది. ★